క్లుప్తంగా

నియామకం


మానస, అధ్యక్షురాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఐకేపీ మండల సమాఖ్య అధ్యక్షురాలిగా తాడ్వాయి గ్రామానికి చెందిన బంగారు మానస ఎన్నికయ్యారు. మంగళవా రం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలి ఎన్నిక డీపీఎంలు వేణుగోపాల్‌రెడ్డి, గోవింద్‌చౌహాన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. మళ్లీ రెండోవసారి కూడా అధ్యక్షురాలిగా బంగారు మానస, కార్యదర్శి పులి భాగ్యలక్ష్మి, కోశాధికారిగా రాధలను ఎన్నికైనట్లు ఏపీఎం శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో సీసీలు పూనెం నర్సింహులు, నాగేశ్వర్‌రావు, సుజాత, రమణ, కుమారస్వామి, వీఓ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా బంద్



వెంకటాపురం(కె): మండల కేంద్రానికి చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు చిడెం సాయి ప్రకాశ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్‌ను నిర్వహించారు. ఉదయం నుంచి దుకాణాలు తెరుచుకోలేదు. సాయి ప్రకాశ్ మండలంలో అందరికి సుపరిచితుడు కావడంతో మండల ప్రజలు సంతాపం తెలిపారు. కాగా సోమవారం రాత్రి సాయి ప్రకాశ్‌ను హత్య చేశారనే వార్త బయటకు రావటంతో హత్యకు సంబంధం ఉందని మండల కేంద్రానికి చెందిన ఓ మహిళను మృతుడి బంధువులు దేహశుద్ధి చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ట్రైబల్ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు

ఏటూరునాగారం: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ బాలికల కళాశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ శ్రీవాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఎన్ఈటీ), స్టేట్ ఎలిజిబిటీ టెస్ట్(ఎస్ఈటీ) క్వాలిఫై అయ్యారని పేర్కొన్నారు. మరికొంత మంది సెంట్రల్ యూనివర్సిటీలో సీట్లు దక్కించుకున్నట్లు తెలిపారు. అంతే కాకుండా క్రీడల్లో రాణిస్తూ ఉద్యోగాలు కూడా పొందుతున్నారని అన్నారుఉ. 2025–26 సంవత్సరంలో కళాశాలలో అడ్మిషన్లను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

తాగునీటి కోసం నిరసన

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కొత్తపల్లి కాలనీలో నీటి ఎద్దడి ఏర్పడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఖాళీ బిందెలతో బోరింగ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. భగీరథ నీళ్లు రాకపోవడంతో కనీసం బోరు పని చేసిన కొంత మేర నీటిని వినియోగించుకునే వాళ్లమని, ప్రస్తుతం నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి వెంటనే నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


ధరణి(983) అఫ్షి(984) అఫీరా (975) స్ఫూర్తి(970) అనూష(970) నవ్యాంజలి(960) మేఘన(952) మహేశ్వరీ(939)


ప్రియాంక(924) కీర్తన(850) కీర్తన (842) సాత్విక(747) అశోక్(646) చైత్ర(465) నితీష్(461) మధులత (460)


రామ్‌చరణ్(458) ప్రణవి(428) మన్వీత(415)

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాల విద్యార్థులు మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దేవకి తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో స్ఫూర్తి 970, స్నేహప్రియ 943, చందుశ్రీ 911, బీపీసీలో ఐశ్వర్య 955, దివ్యశ్రీ 935, ఎం ఐశ్వర్య 929, సీఈసీలో రితీష్‌నాయక్ 891, గ్రీష్మ 862, నేహలత 860 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో నీతిష్ 461, కీర్తన 459, శృతి 420, బీపీసీలో కీర్తన 401, మనోజ్ 393, సుష్మకుమారి 391, సీఈసీలో రాజ్‌కుమార్ 401, హనీష్ 370, వర్షిత 347 సాధించారని అన్నారు. మొదటి సంవత్సరంలో 78శాతం, ద్వితీయ సంవత్సరంలో 91 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

జగ్గన్నపేట ఆశ్రమ కళాశాలలో..

జగ్గన్నపేట బాలికల ఆశ్రమ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 94 శాతం, మొదటి సంవత్సరంలో 91 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో అశ్విని 831, బీపీసీలో దీపిక 885, సీఈసీలో 826 సాధించగా, మొదటి సంవత్సరంలో ఎంపీసీలో ప్రమీల 388, బీపీసీలో 406, సీఈసీలో శ్రీలత 437 సాధించారని తెలిపారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ 200ల మంది పరీక్షలను రాయగా 133 మంది మాత్రమే ఉత్తీర్ణత పొందారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో జిల్లా టాపర్‌గా మండల కేంద్రానికి చెందిన పెండ్యాల చైత్ర 465 మార్కులు సాధించారు. అలాగే బైపీసీలో సౌమ్య 393, హెచ్‌ఈసీలో దుర్గా భవానికి 412 మార్కులు వచ్చాయి. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కీర్తన 842, బీపీసీ జోసఫ్ 841 మార్కులు సాధించారు.

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా గాంధీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 60 మందికి గాను 24 మంది, ద్వితీయ సంవత్సరంలో 118 మంది విద్యార్థులు పరీక్షలను రాయగా అందులో 91 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఎస్కేబా 322, బైపీసీలో మనోగ్న 315, సీఈసీ మాధవి దత్త 291, ఎంపీహెచ్‌డబ్ల్యూ నుంచి రమ్య 471 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ నుంచి డెక్క ధరణి 983, బైపీసీ నుంచి లేగల కీర్తన 850, సీఈసీ నుంచి అర్వపల్లి సాత్విక 747, హెచ్‌ఈసీ నుంచి తాటి అశోక్ 646, ఎంహెచ్‌డబ్ల్యూ నుంచి కంపెల్లి సంకీర్తణ 950 మార్కులు సాధించారు.

వెంకటాపురం(ఎం): ఇంటర్ ఫలితాల్లో వెంకటాపురం ప్రభుత్వ జూనియార్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో బేతి ప్రణవి 428 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో కొటం ప్రియాంక 924 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినట్లు వెల్లడించారు.

గోవిందరావుపేట: మండలంలోని కస్తూరిబా గాంధీ కళాశాలకు చెందిన విద్యార్థిని మహేశ్వరి బీపీసీలో 939 మార్కులతో మండల టాపర్‌గా నిలించింది. ప్రథమ సంవత్సరంలో మండలంలోని మోడల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని లావుడ్యా మన్విత బైపీసీ విభాగంలో 415 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

బైపీసీ విభాగంలో జిల్లాలో ఫస్ట్ ర్యాంక్

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీలో జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ అవిలయ్య తెలిపారు. చింతల అనూష బైపీసీ సెకండియర్ నుంచి 970 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. తిప్పన పల్లి నవ్యాంజలి బైపీసీ 960 మార్కులతో జిల్లాలో మూడో ర్యాంక్ సాధించింది. ఎంపీసీలో పాయం మేఘన 952 మార్కులు సాధించింది.

మంగపేట: మండల కేంద్రంలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 89 మంది పరీక్ష రాయగా 81 మంది, ద్వితీయ సంవత్సరం 92 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 83 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కమలాపురం గ్రామానికి చెందిన తాలూకా మధులత 460, అరెండ రామ్‌చరణ్ 458 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కమలాపురానికి చెందిన మహ్మద్ అష్మి 984 మార్కులు జిల్లాలో సెకండ్ టాపర్‌గా నిలువగా మండల కేంద్రంలోని గంపోనిగూడెంకు చెందిన అబ్బాస్ ఇబ్రహీం అఫీరా 975 సాధించింది.

గాలివాన బీభత్సం


విరిగి పడిన చెట్లను పొక్లెయినర్‌తో తొలగింపజేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: మండలంలో మంగళవారం గాలివానకు ఏటూరునాగారం–తాడ్వాయి మధ్యలోని చెట్లు విరిగిపడడంతో ఐదు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్లపై వృక్షాలు పడి ఏ వాహనం కూడా కదిలే పరిస్థితి లేకపోవడంతో ఎస్సై తాజొద్దీన్ పొక్లెయినర్‌తో చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ట్రాఫిక్‌లో అంబులెన్సు సైతం గంటపాటు వేచి ఉండడం గమనార్హం. అంతేకాకుండా కరెంటు స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ వైర్లు తెగి ఏజెన్సీ అంతా అంధకారంలో ఉండిపోయింది. విద్యుత్‌శాఖ అధికారులు తీగలను సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు.

వాజేడు: మండలంలో ఒక్క సారిగా వీచిన గాలికి ప్రగళ్లపల్లి, చెరుకూరు గ్రామాల్లో విద్యుత్ తీగెలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. గాలి తగ్గిన వెంటనే వడగళ్ల వాన ప్రారంభమై జల్లులు పడి తగ్గింది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు తెగిన విద్యుత్ తీగెలను మరమ్మతు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

గ్రీన్ చానల్ ద్వారా వేతనాల విడుదలపై హర్షం


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న కార్మికులు

ములుగు రూరల్: పంచాయతీ రాజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు విడుదల చేయడంతో పంచాయతీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పత్తిరి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు పెంట రఘులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బంది, కారోబార్లు, మల్టిపర్పస్ వర్కర్‌లకు ఎస్టీఓల ద్వారా వేతనాలు అందడం కష్టంగా ఉండేదని గ్రీన్ చానల్ ద్వారా నేరుగా కార్మికుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, మల్టిపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్నేహారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 82 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం 24 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం మరికా, బీసీ మద్రిగూడెం, నూగూరు రంగరాజాపురం, ఆలుబాక గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్, మనోహర్, డీపీఎంఓ సత్యనారాయణ, సిబ్బంది యాకలక్ష్మి, రామలక్ష్మి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


చిట్యాల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రంగాపురం, ఇస్సిపేట, మొగుళ్లపల్లి, కొరికిశాల, మొట్లపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, కాంగ్రెస్ నాయకులు తక్కళపెల్లి రాజు, నడిగొటి రాము, ఆకుతోట కుమారస్వామి, రాజేశ్వర్ రావు, లింగరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు

చిట్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వొద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిర్వాహకులు సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో, నవాబుపేట గ్రామంలో కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్డీఓ నరేష్, పౌరసఫరాల అధికారి శ్రీనాథ్, డీఎం రాములు తహసీల్దార్ హేమ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి ఉన్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు


రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సామగ్రి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న షాపుల వద్ద కొనుగోలు చేసే వాహనదారులు రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్స్ నిర్వహించే యజమానులు ఎలాంటి పార్కింగ్‌ను ఏర్పాటు చేయకపోవడంతో వినియోగదారులు వారి అవసరాల కోసం షాపుల్లోకి వెళ్లడం వల్ల వాహనాలను రోడ్లపైనే ఉంచుతున్నారు. బస్టాండ్ నుంచి వై జంక్షన్ వరకు షాపులు నిర్వహించే యజమానులు సైతం వారి సామగ్రిని సైడ్ కాల్వలకు దాటి ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర అసౌకర్యంగా మారింది. మురుగుకాల్వలు దాటి ఎలాంటి సామగ్రి ఏర్పాటు చేయకుండా గ్రామ పంచాయతీ, పోలీసుశాఖ, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రెండు వాహనాలు ఒకేసారి వెళ్లే రోడ్డులో కేవలం ఒకే వాహనం ఇబ్బంది పడుతూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాలను పార్కింగ్ చేసే ప్రాంతాలను గుర్తించడంతోపాటు షాపుల యజమానులు వారి సామగ్రిని కాల్వలు దాటి రోడ్లపై ఏర్పాటు చేయకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు..



వాహనాలు, షాపుల్లోని సామగ్రిని కాల్వలు ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. డబుల్ రోడ్డు కాస్తా సింగిల్ రోడ్డుగా కనిపిస్తోంది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు దృష్టి సారించి కాల్వలు దాటి సామగ్రి ఉంచకుండా వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూడాలి.

– బట్టు రమేశ్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు

బోర్డులు తొలగించాలి



సైడ్‌కాల్వలు దాటి బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డులను తొలగించి షాపుల యజమానులకు జరిమానాలను విధించాలి. నీళ్లట్యాంకులు, పైపులు, ఇతర సామగ్రిని సైతం కాల్వలు దాటించి ఉంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే రోడ్డుపై ఆరు ఇంచుల మందం మట్టిపేరుకుపోయి బీటీ రోడ్డు కాస్తా మట్టిరోడ్డుగా మారి కనిపిస్తోంది. దానిని కూడా జీపీ అధికారులు తొలగించాలి.

– గండెపల్లి నర్సయ్య, ఏటూరునాగారం.

సౌకర్యాల కల్పనలో రాజీపడొద్దు

- మంత్రి సీతక్క


బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్ తదితరులు

మంగపేట: శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి తరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు(జాతర) సౌకర్యాల కల్పనలో అధికారులు రాజీపడొద్దని పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. మే 08 నుంచి 17 వరకు జరుగనున్న మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి తరుకల్యాణ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను మంత్రి సీతక్క మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోతు రవిచందర్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 10 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మరుగుదొడ్లు వద్ద అన్ని చర్యలు చేటపట్టాలన్నారు. ప్రతి అంశంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాని, దర్శనం కోసం క్యూలైన్లు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్ సూరి, వివిధ శాఖల అధికారులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారి బ్రహ్మోత్సవాల వివరాలు

మే నెల 08న ఉదయం అంకురార్పన, 09న ఉదయం గరుడాదివాసం, 10న సాయంత్రం దేవతాహ్వానం, భేరీపూజ, 11న సాయంత్రం ఎదుర్కోలు, గరుడవాహనసేవ, 12న మధ్యాహ్నం 12 గంటలకు (అభిజిత్ లగ్నంలో) స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, 13న సాయంత్రం 07 గంటల నుంచి రథోత్సవం, 14న సాయంత్రం 06 గంటల నుంచి 08 గంటల వరకు సదస్యం(వేదాశీర్వచనం), 15న సాయంత్రం 06 నుంచి 08 గంటల వరకు తెప్పోత్సవం, దోపోత్సవం, 16న నగవెళ్లి, 17న వసంతోత్సవంతో జాతర పరిసమాప్తం.

పరామర్శ

ప్రకృతి వైపరీత్యం, అకాల వర్షాల వలన పంట నష్టపోయిన ప్రతి బాధిత రైతుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అకాల వర్షానికి 15 ఎకరాల్లో పంట నష్టపోవడంతో పురుగుల మందు తాగి మృతి చెందిన మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మొట్లగూడెం గ్రామానికి చెందిన రైతు యాలం నర్సింహారావు కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రస్తుత సాయంగా ఏటూరునాగారం ఐటీడీఏ ద్వారా రూ25,000 చెక్కు, అలాగే మంత్రి రూ.25,000 నగదను అందజేశారు. అనంతరం కొత్తూరు మొట్లగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకుడు బంగారు నర్సయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ 15,000లు ఆర్థిక సాయంగా అందజేశారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం: విద్యార్థులు బాగా చదువుకోని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు నూతన భవనం కోసం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం విద్య అందించడానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కేజీబీవీ భవనం కోసం రాష్ట్ర ప్రభుత్వం 3.30 కోట్లను మంజూరు చేసిందన్నారు. విద్యార్థులు సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆహారం, విద్య, సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు ఎండీ.అప్సర్‌పాషా, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత 53 శాతమే..

ఏటూరునాగారం: ఇంటర్ ఫలితాల్లో ఏటూరునాగారంలోని ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల, గిరిజన బాలికల గురుకుల కళాశాలల్లో ఉత్తీర్ణతశాతం కేవలం 53శాతం మాత్రమే రావడం గమనార్హం. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విద్యానేర్పుతున్న ప్రభుత్వ కళాశాలల్లో విద్య ప్రమాణాలు పడిపోవడంతో తల్లిదండ్రుల ఆశలు నిరాశగా మారాయి. ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల బాలుర, బాలికల కళాశాలల్లో అధ్యాపకులు, యజమాన్య పట్టింపులేని తనం ఈ ఫలితాలతో తేటతెల్లం అయ్యింది.

ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు


ఆస్పత్రిలో పవన్ కుమార్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక గోదావరి ఇసుక ర్యాప్ వద్ద నిర్వహించిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆలుబాకకు చెందిన తాటి పవన్ కుమార్ ఆలుబాక ఇసుక ర్యాంప్‌లో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా వాటర్ ట్యాంక్‌లో నీరు నింపుకోని ఇసుక ర్యాంప్ వద్దకు వెళ్లి ట్రాక్టర్‌ను ఆపే క్రమంలో ట్రాక్టర్‌పై నుంచి పడటంతో ట్రాక్టర్ టైర్ పవన్ పైనుంచి వెళ్లింది. గమనించిన గ్రామస్తులు వెంకటాపురం ఆస్పత్రి తరలించి మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

‘ఉద్యోగులను బదిలీ చేయాలి’

ములుగు రూరల్: జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో వైద్య, విద్య, పోలీస్‌శాఖలో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు కొంతమంది ఏళ్ల తరబడి పాతుకుపోయారని ఆరోపించారు. జిల్లా ఆస్పత్రిలో వసతులు ఉన్నా ప్రజలకు సరైన వైద్యం అందించడంలో విఫలమయ్యారని వివరించారు. విద్యాశాఖలో బదిలీలు, ప్రమోషన్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న జిల్లా అధికారిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పోలీస్ అధికారులు మాత్రం మంత్రి సీతక్క కనుసన్నల్లో పనిచేస్తున్నారని విమర్శించారు. దీర్ఘకాలికంగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను వెంటనే బదిలీ చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.